


నేడు గాన కోకిల రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట



విజయనగరం వాసి, గానకోకిల పి.సుశీల సోమవారం జిల్లాకు రానున్నారు. నగరానికి చెందిన శ్రీ గురు నారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా వారు అందిస్తున్న పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారానికి ఆమె ఎంపిక అయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆనంద గజపతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకోనున్నారు. 90 ఏళ్ల వయసులో ఆమె స్వస్థలానికి రాబోతున్నారు. ఇంతకుముందు ఆమె 2019లో జరిగిన మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల వందేళ్ల ఉత్సవానికి హాజరయ్యారు. ఆమెతోపాటు సినీ సంగీత దర్శకులు మణిశర్మ రానున్నారు.

ఆదివాసీల జీవనం దుర్భరం

- గిరిజన చట్టాలకు రక్షణ కరువు
- నేటికీ తప్పని డోలీమోతలు
- గిట్టుబాటు ధరలేని అటవీ ఉత్పత్తులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



అభివృద్ధికి దూరం గా ఆదివాసీలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా మారుమూల గిరిజన పల్లెల్లో ఆదివాసీలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్య ఫలాలు అందని ద్రాక్షగానే ఉన్నాయి. ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది రాజకీయ నాయకులు, అధికారులు మారినా ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో మాత్రం వెలుగురేఖ నిండలేదు. నాటికీ నేటికీ ఆదివాసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే ఉంది. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అభివృద్ధి శూన్యం. ఉద్యోగం, ఉపాధి లేక వలస బాట పడుతున్న వారు ఎందరో. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాల కోసం రూపొందించిన జిఒ 3ను రద్దు చేశారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు పగడ్బందీగా అమలు కాకపోవడంతో అడవిపై హక్కు కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

గిరిజన చట్టాలు చట్టుబండలే...


తరతరాల నుంచి అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసీలకు ప్రభుత్వ పాలకుల విధానాలతో, కార్పొరేట్ శక్తులతో అడవిలో కూడా రక్షణ కరువైంది. ఆదివాసీల జాగృతి కోసం ఎన్నో చట్టాలు అమలు చేసినా చట్టుబండలుగానే మిగిలిపోయాయి. అమాయకులైన ఆదివాసీల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఆనాటి అల్లూరి సీతారామరాజు నుంచి మొన్న జరిగిన శ్రీకాకుళ రైతాంగ పోరాటం ఉద్యమం వరకు పోరాడి సాధించుకున్న గిరిజన హక్కులు, చట్టాలను నేటి పాలకులు స్వార్థ రాజకీయాల కోసం నిర్వీర్యం చేస్తున్నారు. 1/70, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, ఎల్‌టిఆర్, ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయడం లేదు. గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ, జిసిసిల పనితీరు అంతంత మాత్రమే. జిఒ 3 రద్దు, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చే ప్రక్రియ నేటి వరకు జరగలేదు.

గిట్టుబాటు ధర లేని అటవీ ఉత్పత్తులు

గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు దళారుల బెడద వెంటాడడంతో సరైన గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్ట పోతున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట మండలాల్లో ఎక్కువ శాతం చింతచెట్లు, జీడి తోటలు ఉన్నాయి. గిరిజనులకు ప్రధానమైన ఈ రెండు పంటలను ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతో వచ్చిన పంటను తక్కువ ధరకే దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి.

గిరిజన కళలు కనుమరుగు

ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రోజు రోజుకు గిరిజన కళలు కనుమరుగవుతున్నాయి. గిరిజన గ్రామాల్లో సవర, జాతపు, కొండదొర, గదబ గిరిజన తెగలు జీవనం సాగిస్తున్నాయి. వారు నేటికీ సాంప్రదాయ కళలు, ఆచారాలు పాటిస్తున్నారు. డప్పు, తుడుము, సన్నాయి వాయిద్య కళాకారులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బాధ్యతతో పని చేస్తున్నారు. గిరిజన కళలు, సాంప్రదాయాలు ప్రతిభింబించేలా గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్ల నుంచి కోరుతున్నా ఎటువంటి చర్యలు లేవు. ఎన్నికల సమయాల్లో గ్రామాలకు వస్తున్న ప్రజాప్రతినిధులారా గెలిచాకైనా తమ కష్టాలపై దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



డోలిపై రోగిని తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

సమస్యలతో సహజీవనం

పార్వతీపురం మన్యం జిల్లా 3934 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో ఉంది. 15 మండలాలు ఉన్నాయి. 483 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పార్వతీపురం, సాలూరు కురుపాం, పాలకొండ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ లు ఉన్నాయి. 2.65 లక్షల మంది గిరిజన జనాభా ఉన్నారు. మారుమూల కొండల్లో ఆదివాసీలు వందలాది సమస్యలతో సహజీవనం సాగిస్తున్నారు. నేటి వరకు గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఇక్కడ విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోని పరిస్థితి. అక్షరాస్యతకు దూరంగా అనారోగ్యంతో మరణాలకు దగ్గరగా జీవనం సాగిస్తున్నారు.

పింఛన్లు అందకుండా చేసిన కూటమి

కొటియా గ్రామాలపై అధికారులు స్పందించాలి : డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నిరుపేదల పాలిట శాపంగా తయారైందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆరోపించారు. ఆదివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సంఘానికి టిడిపి, జనసేన నాయకులు ఫిర్యాదు చేయడం వల్లే పేదలకు పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వాలంటీర్లను తప్పించారని చెప్పారు. మొదటి నుంచి టిడిపి, జనసేన వాలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతున్నాయన్నారు. అవమానకరమైన పదజాలంతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వాలంటీర్లను విమర్శించారని చెప్పారు. సంఘవిద్రోహ శక్తులని జనసేన అధినేత పవన్ కల్యాణ్ దాడి చేశారన్నారు. చివరికి నెలనెలా పేదలకు అందజేసే పింఛన్ల పంపిణీ విషయంలో కూడా రాజకీయం చేశారని ఆరోపించారు. గడప దాటలేని వృద్ధులు, వికలాంగులకు ప్రతినెలా ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న వాలంటీర్లను బాధ్యతల నుంచి తప్పించడం అన్యాయమన్నారు. దీనివల్ల వేలాది మంది వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు. వచ్చేనెల తర్వాత సుమారు మూడు నెలల పాటు లబ్ధిదారులకు నేరుగా పింఛన్లు అందజేసే సౌకర్యం వుండదన్నారు. ఎన్నికల సంఘం అధికారులు పింఛన్లు ఎలా అందజేస్తారో చూడాలని చెప్పారు. ఈ పరిస్థితి రావడానికి కారణం టిడిపి, జనసేన పార్టీలేనని పేదలు గ్రహించాలని కోరారు. పేదలకు మేలు చేసే పనులు కూటమి నాయకులకు ఇష్టం లేదన్నారు. పింఛను లబ్దిదారులు వాస్తవాలు గ్రహించాలని, కూటమి నాయకులకు నిలదీయాలని రాజన్నదొర కోరారు.

కొటియాపై జిల్లా అధికారులు స్పందించాలి

కొటియా గ్రామాల్లో ఒడిశా అధికారులు అనుసరిస్తున్న దుందుడుకు చర్యలపై పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు స్పందించాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్,ఎస్పీ, ఐటిడిఎ పిఒలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి కొటియా గ్రామాల్లో శాంతియుత పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలు సమయంలో ఒడిశా ప్రభుత్వం ఎగువ శెంబి ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలకు చర్యలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు సంయమనంతో వ్యవహరించిందని చెప్పారు. దీన్ని అలుసుగా తీసుకుని ఒడిశా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొటియా గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను మొహరించాలని సూచించారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఒడిశా అధికారులు దూకుడుగా వ్యవహరించి కొటియా గ్రామాల ఓటర్లను పోలింగ్‌కు రాకుండా అడ్డుకున్నారని గుర్తు చేశారు. గత అనుభవాలను దష్టిలో పెట్టుకొని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రభుత్వంతో చర్చించి ఒడిశా అధికారులపై కోర్టులో కేసు వేయాలని రాజన్నదొర కోరారు.

5డి థియేటర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక అడ్వెంచర్ పార్క్‌లో 5డి థియేటర్‌ను మళ్లీ ప్రారం భించారు. ఆదివారం కావడంతో పార్క్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద విహార్ వద్ద డ్యాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని పర్యాటకులు సందర్శించారు.



పునఃప్రారంభమైన 5డి థియేటర్



గిరిజనులతో మాట్లాడుతున్న డిఎంఒ జగన్మోహనరావు

దోమల నివారణకు చర్యలు

సమిష్టి కృషితో మలేరియా అదుపు : డిఎంఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాల్లో ఫీవర్ సర్వేలెన్స్ చేపట్టి మలేరియా, డెంగీ తదితర జ్వరాలను సత్వరమే గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని జర్న గ్రామాన్ని శనివారం రాత్రి వైద్య బృందంతో సందర్శించి దోమల నివారణకు సిబ్బంది అక్కడ చేపట్టిన ఫాగింగ్ నిర్వహణను ఆయన పరిశీలించారు. అదే రోజు గ్రామంలో దోమల నివారణ మందు స్ప్రేయింగ్, ఫీవర్ సర్వలెన్స్ చేయించారు. జ్వర నిర్ధారణ పరీక్షల నివేదికలను ఆయన పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా జ్వరం అనిపిస్తే గ్రామంలో ఉన్న వైద్య సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పించారు. వేసవి రీత్యా శరీరంలో నీటి శాతం తగ్గుతూ వస్తుందని, కావున తరచుగా నీరు, ద్రావణాలు తీసుకోవాలని, లేకపోతే శరీర ఉష్ణోగ్రతలు పెరుగుతాయని తెలిపారు. పిల్లల విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వివరించారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టి జ్వర లక్షణాలున్న వారిని గుర్తించిన వెంటనే నిర్ధారణ పరీక్షలు జరపాలని ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో దోమల నివారణా చర్యలు చేపట్టి, డ్రైడే పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. సమిష్టి కృషితో జ్వరాలు ప్రబలకుండా నివారించవచ్చని అన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ దుడ్డుఖల్లు పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఒపి, ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి జ్వరాలు ఏమేరకు నమోదవుతున్నాయి, వాటి నిర్ధారణ పరీక్షల నివేదికలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి నారాయణరావు, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, ఇఒ సత్యరాజు, ఎంటిఎస్ ఆదినారాయణ, వైద్య సిబ్బంది కావేరి, రోషిణి, ధర్మారావు, గోవిందరావు, అంగన్వాడీ సిబ్బంది శోభారాణి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

అడ్డగోలుగా అనధికార భవన నిర్మాణాలు

- ఇళ్ల అనుమతుల పేరిట వాణిజ్య సముదాయాలు నిర్మాణం
- కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ
- మున్సిపల్ ఖజానాకు గండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు అడ్డగోలుగా సాగిపోతున్నాయి. ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్ల దృష్టిలో పెట్టకుండా, వారి అధ్వర్యంలో లైసెన్స్‌లు పొందకుండా, టౌన్ ప్లానింగ్ విభాగం నిబంధనలతో సంబంధం లేకుండా భవన యజమానులు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా మీరు ఎంచక్కా కట్టుకోండి మేము తర్వాత నోటీసులిస్తామన్న చందంగా ఉంది స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, కార్యదర్శుల పరిస్థితి.

గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన తర్వాత అనధికార, అక్రమ నిర్మాణాలను భవన యజమానులు యథేచ్ఛగా సాగిస్తున్నారు. అయితే వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మిన్న కుండిపోవడంతో భవన యజమానులు తమ పనులను తొందరగానే పూర్తి చేసి సున్నాలు వేసి గృహ ప్రవేశాలు కూడా చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరికొందరు అనుమతులు తీసుకోకుండానే భవన నిర్మానాలు చేస్తున్నారు. ఇంకొందరు నిర్మాణ అనుమతులు నామ మాత్రంగా తీసుకొని భవన నిర్మాణాలను నిబంధనలకు వ్యతిరేకంగా కడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పర్యవేక్షణ కూడా చేయడం లేదు.

పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు బైపాస్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం రహదారి, ఎస్ ఎన్ ఎం నగర్‌తో పాటు స్థానిక ప్రజల రాకపోకలు ఎక్కువగా సాగించే పలు వార్డుల్లో గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకొని దర్జాగా వ్యాపార, వాణిజ్య భవన నిర్మాణాలను చేపడుతున్నారు. షాపులకు షట్టర్లు కూడా బిగిస్తున్నా, ఆయా వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు కనీస బాధ్యతతో పర్యవేక్షణ చేయడం లేదు. దీంతో యజమానులు యథేచ్ఛగా నిర్మాణాలను కొనసాగిస్తున్నా, భవన నిర్మాణం పూర్తి అయిన తర్వాత నోటీసులు ఇస్తూ చేతులుదులుపుకునేలా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇటువంటి అనధికార, అక్రమ నిర్మాణాల వల్ల ఆయా ప్రాంతాల్లో పార్కింగ్‌తో పాటు ట్రాఫిక్, ఇతర సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వ్యాపార, వాణిజ్యాల కోసం భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటే ప్లాన్‌లో వాహనాల పార్కింగ్ కు స్థలం చూపించాల్సి ఉంది. దీంతోపాటు భవిష్యత్తులో రోడ్ల విస్తీర్ణం పనులకు అవసరమైన ఖాళీ స్థలాన్ని మున్సిపల్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అవేవీ పాటించకుండా పార్కింగ్ స్థలాలను సైతం వదలకుండా నిర్మాణాలను చేపట్టడానికి గృహ నిర్మాణాల అనుమతులను పొందుతున్నారు. నిర్మాణాలను పూర్తి చేసిన తర్వాత ఆ షాపులకు షట్టర్ బిగించి వేలాది రూపాయలు అద్దెలకు ఇచ్చి లాభం పొందుతున్నారు. ఆ షాపులకు వచ్చేవారికి పార్కింగ్ సౌకర్యం లేక షాపు ముందు ఉన్న రహదారిపైనే ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుంది. ఇంత జరుగుతున్నా అలాంటి నిర్మాణాలకు పన్నులు వేసే క్రమంలో అధికారులు మిన్నకుండి పోవడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుంది.

తాజాగా పట్టణంలోని నాయుడు వీధి ముందు ఉన్న పురాతన భవనం దిశ మార్చి మూడు అడుగులు ముందుకు వచ్చి వాణిజ్య దుకాణాలుగా నిర్మాణం చేసి అద్దెలకు ఇచ్చినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవన నిర్మాణ యజమానికి నోటీసులతో సరిపెట్టుకున్నారు. దీంతో పాటు పాత బస్టాండ్ రోడ్డులో ఎస్ఎన్ఎం నగర్ ముందు ఉన్న ఖాళీ స్థలానికి కొందరు వ్యక్తులు నివాస గృహానికి అనుమతులు తీసుకుని ఏకంగా ఎనిమిది వాణిజ్య సముదాయాలను నిర్మించారు. దీంతోపాటు ఎస్ఎన్ఎం నగర్‌లో ఉన్న సాయిబాబా మందిరానికి ఆనుకొని ఒక వ్యక్తి జి ప్లస్ టు భవన నిర్మాణానికి అనుమతులు తీసుకుని రెండు స్లాబ్‌లు వేసి నిబంధనలకు వ్యతిరేకంగా అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. వీటితో పాటు పలు వార్డుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా అనధికార నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మరికొందరు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి పట్టణంలో పలు వార్డుల్లో ఎన్నో అనధికార, అక్రమ నిర్మాణాలు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పరిధిలో ఇలాంటి అనధికార అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని గుర్తించి మున్సిపాల్టీకి ఆదాయ రూపంలో రావాల్సిన ఫీజులను చెల్లించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ దిశగా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు చర్యలు చేపడతారో, లేదో చూడాలి.

అనుమతుల్లేకుండా నిర్మించిన అపార్ట్‌మెంట్



కొత్త సీసాలో పాత నీరేనా..!

జనసేనైనా టికెట్ మాదే అంటున్న జయకృష్ణ, భూదేవి

ప్రజాశక్తి-పాలకొండ

పొత్తుల్లో భాగంగా పాలకొండ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంలో ఆంతర్యం ఎవరికీ అంతుపట్టని విషయంగా ఉంది. టిడిపిలో గ్రూపు రాజకీయాలను చెక్ పెట్టడానికే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని ఒక పక్క బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మరో పక్క జనసేన నాయకులు తమ పార్టీలో పోటీ చేసే అభ్యర్థి లేరని వాళ్లలో వాళ్లే చర్చించుకుంటున్నారు. టిడిపికి బలమైన ఓటు బ్యాంకు ఉన్నా పాలకొండ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడం వెనుక టిడిపిలో ఉన్న గ్రూప్ తగాదాలే కారణమని చెప్పవచ్చును. కానీ జనసేన తరపున పోటీ చేయడానికి ఇదే టిడిపి అభ్యర్థులు పార్టీ మారైనా పోటీ పడడం కొసమెరుపు.

టిడిపిలో వైరి వర్గాలుగా పేరు పొందిన నిమ్మక జయకష్ణ, పడాల భూదేవి ఇద్దరూ జనసేన తరపున టికెట్ ఆశిస్తున్నారు. టిడిపిలో ఉన్నప్పుడు టికెట్ మాది అంటే మాది అని ప్రకటించుకున్న జయకృష్ణ, భూదేవి ఇప్పుడు జనసేనలో సైతం టికెట్ మాకే దక్కుతుందని ప్రకటించుకోవడం కొత్త సీసాలో పాత నీరు అనే సామెతను గుర్తు చేస్తున్నారు. ఏది ఏమైనా ముందు నుండి టిడిపి గుర్తును జనాల్లోకి తీసుకుని వెళ్లిన ఈ నాయకులు జనసేన తరపున టికెట్ ఆశిస్తూ ఆ గుర్తును ఎలా జనాల్లోకి తీసుకుని వెళ్తారో చూడాల్సిందే. గత ఎన్నికల్లో ఇక్కడ జనసేనతో పొత్తుల్లో భాగంగా సిపిఐ నుండి పోటీ చేసిన డివిజి శంకరరావుకు నోటా కంటే తక్కువ ఓట్లు తెచ్చుకొని నాల్గొవ స్థానంలో ఉండటం ఇక్కడ జనసేనకు ఎంత పట్టు ఉందో చెప్పటానికి ఉదాహరణగా తీసుకోవచ్చు. టిడిపిలో గ్రూపుల పోరును అరికట్టేందుకు జనసేనకు టికెట్ కేటాయించడం ఇరు పార్టీలకు ఎంత కలిసొస్తుందో చూడాలి. ఎందుకంటే టిడిపిలో వైరి వర్గాలుగా పేరు పొందిన నిమ్మక జయకృష్ణ, పడాల భూదేవి గ్రూపులు ఒకరికి ఒకరు సహకరించుకోమనే పట్టుదలతో ఉండడం వల్లే టిడిపి అధినేత జనసేనకు ఈ స్థానం కేటాయించారు. అదే వర్గాలు ఇప్పుడు జనసేనలో ఒకరికి ఒకరు సహకరించుకుంటారో లేదో కాలమే సమాధానం చెప్పాలి. ఏది ఏమైనా జనసేన తరపున టికెట్ ఆశిస్తున్న జయకృష్ణకు టికెట్ దక్కినా, భూదేవికి టికెట్ దక్కినా కూడా కొత్త సీసాలో పాత నీరు చందంగా ఉంటుందనేది నియోజకవర్గ ప్రజల మాట.

పాలకొండ టికెట్ నిమ్మలకే ఇవ్వాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ టికెట్టు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ జడ్పిటిసి సభ్యులు, నిమ్మల నిబ్రంకు కేటాయించాలని, జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ వాలంటీర్ ఎం.పుండరీకం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పొత్తులో భాగంగా పాలకొండ నియోజకవర్గం జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులు జనసేన పార్టీలో చేరుతాం మాకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారని, ఇది ఎంతవరకు సమజసమని ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీలో జయకృష్ణ, పడాల భూదేవి గ్రూపులున్నాయని, వీరిద్దరిలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఒక గ్రూపు పని చేయదని, కనుక జనసేన పార్టీ సమన్వయకర్త నిబ్రంకు టిక్కెట్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకొండ టికెట్టు గ్రూపుల పోరుకు వద్దు జనసేన పార్టీకే ముద్దు, నిమ్మల నిబ్రం ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఉత్తరాంధ్ర జనసేన నాయకులు తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బిపి నాయుడు మాట్లాడుతూ నిన్నటి వరకు తెలుగుదేశం పార్టీ నాయకులు పాలకొండ జనసేనకు ఇవ్వొద్దనిన్నారని, మరి ఈరోజు జనసేనలో టికెట్ కోసం తిరుగుతున్నారని ఆయన అన్నారు. జనసేనను టిడిపి నాయకులు చులకనగా చూస్తున్నారని, జనసేన పార్టీ కార్యకర్తలు పొత్తు ధర్మాన్ని పాటిస్తూ అభ్యర్థి ఎవరైనా సరే గెలిపించాలని కృషి చేస్తున్నామని అన్నారు. తెలుగుదేశం నాయకులు పొత్తు ధర్మాన్ని పాటించి జనసేన సమన్వయకర్త నిమ్మలకు మద్దతుగా నిలవాలని జనసేన విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. వలస వచ్చే నాయకులకు వద్దు.. జనసేన సమన్వయకర్త నిమ్మల ముద్దు అన్నారు. జనసేన జానీ మాట్లాడుతూ పొత్తులో భాగంగా పాలకొండ టికెట్టు జనసేనకు కేటాయించారని, ఆ టికెట్ కోసం టిడిపి నాయకులు ఆశపడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జనసేన కోసం పనిచేసే వారికి మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి పవన్, ప్రేమ్ కుమార్, జామి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కళింగ కథా జాడ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, అధికారులు

భావితరాలకు దిక్సూచి 'కళింగ కథాజాడ'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళింగ ఆది ఆంధ్ర చరిత్ర తెలిపి, భవిష్యత్తు తరాలకు దిక్సూచిగా కళింగ కథాజాడ పుస్తకం నిలుస్తుందని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో డిఇ చీకటి దివాకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఆదివారం సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా దివాకర్ రచించిన కళింగ కథాజాడ అనే పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త వెలుగు రామానాయుడు ఆవిష్కరించారు. అనంతరం పుస్తకం గురించి అట్టాడ అప్పలనాయుడు మాట్లాడారు. వందేళ్ల చరిత్రను నేటి ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. దాన్ని నాలుగు విభాగాల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు గురించి విశదీకరించారని తెలిపారు. సాహితీ వేత్తలకు జన్మస్థలం, గమ్య స్థలం సమాజమే అన్నారు. అటువంటి సమాజం గురించి మన పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం మనపై ఉందన్నారు. అనంతరం పుస్తక ప్రాముఖ్యతను రచయిత గంటేడ గౌరినాయుడు వివరించారు.

ఈ సందర్భంగా చీకటి దివాకర్ ఉద్యోగిగా చేసిన కృషిని, సాహితీ వేత్తగా అందించిన సేవలను అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరినాయుడు, వెలుగు రామునాయుడు, మన్యం జిల్లా పిఆర్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ, ఎంవిఎన్ వెంకటరావు, రిటైర్డ్ ఆర్‌డిఒ కెఆర్‌డి ప్రసాదరావు కొనియాడారు. అనంతరం పిఆర్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఉద్యోగులు, సాహితీవేత్తలు, కళాకారులు.. దివాకర్, చంద్రిక దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో నాటక రంగ కళాకారులు శేషారావు, పిఆర్ ఎస్ఇ గుప్త, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, ఎంవిఎన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



శిక్షణలో పాల్గొన్న డ్రైవర్లు

102, 104, 108 డ్రైవర్లకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

102, 104, 108 వాహనాల పైలట్లకు ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్లీట్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏమైనా పెద్ద సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనాల రికార్డులను, ఫిట్ నెస్‌ను, వాటి పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి తరలిస్తున్న రోగులకు మంచి సేవలను అందించాలని సూచించారు. వాహనాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 102, 104, 108 సేవల పట్ల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో 108, 104 జిల్లా మేనేజర్లు మన్మధనాయుడు, దుర్గాప్రసాద్, 102, 104, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు విజయకుమార్, రాజశేఖర్, మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి - సీతంపేట

ఉద్యోగ సమయంలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్లు రుక్కుమ్మంగోధరయ్య, అన్నదొర అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐటిడిఎ ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి ఉద్యోగ విరమణ ఆ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక పోస్టులు చేసి ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయులుగా లిల్లీరాణి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఏజెన్సీలో సుమారు 35ఏళ్ల పాటు గిరిజన విద్యార్థులకు అనేక సేవలు అందించి ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం ఎన్జీవోల సంఘం రాష్ట్ర నాయకులు చౌదరి పురుషోత్తం నాయుడు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, కె.సింహాచలం పలు ఉపాధ్యాయులు లిల్లీరాణిని సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ నాయకులు భరత్ భూషణ్, ఎపిఒ రోషిరెడ్డి, విశ్రాంతి చీఫ్ కన్జర్వేటర్ భరత్ కుమార్, విశ్రాంతి కమిషనర్ ఎద్దు లిల్లీ పుష్పనాథం, హెచ్ఎంలు పి పద్మశ్రీ, ఉమా వాణి, నారాయుడు, భాస్కరరావు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



జనసేన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న టిడిపి అభ్యర్థి విజయచంద్ర

ఉమ్మడిగా పోరాడుదాం... విజయం సాధిద్దాం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణ జనసేన కార్యాలయంలో ఆదివారం జనసేన నాయకులు చందక అనిల్ ఆధ్వర్యంలో జనసేన ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థిగా పార్వతీపురం నియోజకవర్గంలో విజయం సాధించే లక్ష్యంతో జనసేన సైనికులు మీవంతుగా గెలిపించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థిగా నన్ను గెలిపించండి మీకు సేవకుడుగా ఎల్లవేళలా మీ అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టపు వెంకటనాయుడు, సీతారాం, వెంకటేష్, రామారావు, భాస్కర్ రావు, జనసేన నాయకులు గోవిందమ్మ, కరుణ, ముఖేష్, సురేష్, కాళీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



అంటిపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - సీతానగరం


మండలంలోని అంటిపేట, అంటివలస గ్రామాల్లో చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇఒపిఆర్‌డి కెకె కుమార్‌వర్మ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయ పరిధిలో త్వరలో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని సచివాలయ పరిధిలో ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ నివారించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, కె.శశిభూషణరావు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

ఆస్పత్రి పాలవుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఇటీవల కాలంలో ప్రతి గ్రామంలో పిచ్చికుక్కల స్వైర విహారం పెరిగిపోయింది. దీంతో శని, ఆదివారాల్లో మండలంలో సుమారు 24 మంది చిన్న పిల్లలకు, పెద్దలకు పిచ్చి కుక్కలు దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి పరిధిలో గల స్వామినాయుడువలస, గంగరేగువలస, కొటిపాం, గుమడ, కొమరాడ గ్రామాల్లో ఉన్న పలువురిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. కుక్క కాటుకు గురైన వారంతా కొమరాడ ఆసుపత్రికి పరుగులు పెట్టి వైద్య సేవల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న ప్రజలతో పాటు వీధుల్లో, గ్రామాల్లో ఉన్న వారిపై హక్కులు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. గ్రామాల్లో పిచ్చికుక్కల సంచారం పెరిగిపోవడంతోనే ఇలాంటి దాడులు జరిగాయని వైద్య సిబ్బంది అంటున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో పిచ్చికుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



బాధితునికి టీకా వేస్తున్న వైద్యాధికారి

వైన్ షాప్‌ల వద్ద బారులు తీరిన మందుబాబులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మద్యం దుకాణాల వద్ద మందుబాబులు ఆదివారం బారులు తీరారు. గత నాలుగు రోజుల నుండి పర్సంటేజీల వారీగా మందు విక్రయాలు జరగడంతో మందు బాబులకు ఆరాటం తప్పటం లేదు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు గంటల మందు విక్రయాలు చేపట్టాలని అధికారులు నిబంధనలు పెట్టడంతో పర్సంటేజ్ పూర్తి అయ్యేసరికి సమయం ఉన్నప్పటికీ మందు షాపులు మూసి వేస్తున్నారు . దీంతో మందుబాబులు బయట అధిక మొత్తాలకు కొనుగోలు చేసే మందు తాగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఇక్కడ పుట్టడమే గిరిజనుల పాపమా?

రిజర్వేషన్లకు దూరమైన ఆదివాసీలు

నాన్ షెడ్యూల్డ్ పంచాయతీ దుడ్డుఖల్లు గ్రామస్తుల ఆవేదన



అభివృద్ధికి ఆమడదూరానున్న దుడ్డుఖల్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇక్కడ గిరిజనులుగా పుట్టడమే పాపమా. రాజ్యాంగం కల్పించిన హక్కులు పొందలేకపోవడమే వీరి శాపమా. అందుకు కారణం ఆ పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండటమే. వివరాల్లోకి వెళితే ...

గుమ్మలక్ష్మీపురం మండలం నూటికి నూరు శాతం ఏజెన్సీ ప్రాంతం. అయినప్పటికీ దుడ్డుఖల్లు పంచాయతీ మాత్రం అందుకు భిన్నంగా నాన్ షెడ్యూల్డ్ పంచాయతీగానే పరిగణించబడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు ఈ పంచాయతీలో నివసిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలు గానీ, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలకు రిజర్వేషన్లు కోల్పోతున్నారు. ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఎటువంటి వ్యవసాయ రుణాలు, బోరు బావులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందడం లేదు. దుడ్డుఖల్లు పంచాయతీ పరిధిలో 15 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొత్తవలస, బెల్లిడి, దొరజమ్ము, కంబగూడ, దొర కేక్కువ, కొల్లిగూడ, లోవలక్ష్మీపురం, విశ్వనాధపురం, దుడ్డుఖల్లు, బుడ్డెం ఖర్జ, మేదరగండ, పిల్లిగూడ, బొడ్లగూడ, చింతలపాడు తదితర గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగానే పరిగణించబడుతున్నాయి. నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించిన నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పై గ్రామాల్లో నివసిస్తున్న వారు గిరిజనులుగా ఉన్నా రిజర్వేషన్ల ప్రక్రియ వీరిదరి చేరడం లేదు. దీంతో చదువుకున్న గిరిజన యువతీ, యువకులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. గిరిజన రైతులకు ఎటువంటి వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ రాయితీలందక ప్రతి ఏటా అప్పులు చేసి పంటలు పండిస్తున్నారు. పంటలకు నష్టం వాటిల్లిన ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందడం లేదు. పక్కా గృహాలు లేవు. తాగునీటి సమస్య వెంటాడుతుంది. 1/70చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం వీరికి వర్తించదు.

ఉపాధి అవకాశాల్లేవు...



మా గ్రామం నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో ఇక్కడ చదువు కున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కోల్పోతున్నాం. నేను డిగ్రీ చదువుకున్నా రిజర్వేషన్ లేక ఉద్యోగం రాక నిరుద్యోగిగా ఉన్నాను. ప్రభుత్వం స్పందించి మా గ్రామాన్ని షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి.

బిడ్డిక సంధ్యశ్రీ,
గిరిజన యువతి దుడ్డుఖల్లు.

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి



దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామం గా ఉండడంతో రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులకు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగానికి రిజర్వేషన్ దూరమైంది. ఏళ్ల నాటి సమస్యను ప్రభుత్వం గుర్తించి షెడ్యూల్డ్ పరిధిలోకి తీసుకొస్తే యువత, మహిళలు, రైతుల అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

పి.తిరుపతిరావు,
సిపిఎం మండల నాయకులు.

నేటికీ వెనుకబాటే



మండలంలోని 27 పంచాయతీలుండగా అందులో 26 పంచాయతీలు షెడ్యూల్, ఒక్క దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో గిరిజనులు నేటికీ దుర్భర జీవనం గడపకు తప్పడం లేదు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు వీరి దరికి చేరడం లేదు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించి దుడ్డుఖల్లు ను షెడ్యూల్ గ్రామంగా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిమ్మక సింహాచలం,
జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు.

ప్రభుత్వ రాయితీలకు దూరం



దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గా ఉండడంతో ఈ పంచాయతీలో ప్రజలు ప్రభుత్వ రాయితీలకు దూరంగా ఉన్నారు. ఐటిడిఎ ద్వారా ఎటువంటి రుణాలందడం లేదు. దీంతో పూర్తిగా వెనుకబడి ఉన్నాం. ఇక్కడ పుట్టడమే పాపమా?.

కొండ గొర్రి గోపాలరావు
గిరిజన యువకుడు,

అర్ధాంతరంగా నిలిచిన ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాలు పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ల భవనాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వీరఘట్టంలో నాలుగు సచివాలయాలున్నప్పటికీ మూడింటికి భవనాలు, ఒక్కొక్క భవనానికి రూ.40లక్షలతో ఉపాధి హామీ నిధుల ద్వారా పనులు చేపట్టినప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. దీంతో ఈ నాలుగు సచివాలయ ఉద్యోగులు ఒకే చోట ఇరుకైన గదుల్లో విధులు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో రెండు సచివాలయాలను వేరే చోట అద్దె గృహంలో నిర్వహణ కొనసాగించినప్పటికీ వాటికి అద్దె చెల్లించలేక మళ్లీ వాటిని ఒకే చోటకు తీసుకురావడంతో వివిధ రూపంలో ఫిర్యాదు చేసుకునేందుకు అర్జీదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహశీల్దార్ కార్యాలయం పక్కన రెండు సచివాలయ భవనాలు ఐదేళ్లు అయినప్పటికీ స్లాబ్లికే పరిమితమైంది. చలివేంద్ర గ్రామంలో పునాదులకే పరిమితమైంది. హుస్సేన్ పురం, కిమ్మి, కత్తుల కవిటి, బిటివాడ, తదితర గ్రామాల్లో భవనాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. కొన్నిచోట్ల పునాదులు వేసి మరికొన్ని శ్లాబ్లు పూర్తి చేసుకొని ప్లాస్టింగులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో గుత్తేదారులు భవనాల అర్ధాంతరంగా నిలిపివేశారు.



వీరఘట్టంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం



పట్టణంలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పట్టణంలో రాజన్నదొర ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆదివారం ఉదయం పట్టణంలోని 17వ వార్డు అక్కేన వీధి, గూడెపు వీధి, అల్లువీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావుతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చెప్పిన హామీలన్నీ నీటిమూటలని విమర్శించారు. అలాంటి పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటే పేదలు నష్టపోతారని చెప్పారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు, యర్రా దాలినాయుడు, కౌన్సిలర్లు గుల్లిపిల్లి నాగేశ్వరరావు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు పాల్గొన్నారు.



గుమడ సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి, గిరిజనులు

ప్రజల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి - కొమరాడ

మతోన్మాద బిజెపిని, దాంతో పొత్తు పెట్టుకున్న టిడిపి, వైసిపి అభ్యర్థులను ఓడించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం గుమడ సంతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ఆవలంభిస్తున్న విధానాలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక భద్రతకు తీవ్ర నష్టం చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన బిజెపిని వ్యతిరేకించకపోగా బలపరచడం, జట్టు కట్టడం సిగ్గుచేటని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే మూడు వ్యవసాయ చట్టాలను, కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్‌కోడ్‌లను బిజెపి తీసుకొస్తే టిడిపి, వైసిపిలు బలపర్చాయని దుయ్యబట్టారు. ప్రభుత్వ సంస్థలైన ఎల్‌ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే, బ్యాంకులు, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలను ప్రైవేటుపరం చేసే పరిస్థితి ఉందన్నారు. అలాగే కొమరాడ మండలానికి సంబంధించి ఏనుగులు, పూర్ణపాడు వంతెన, తోటపల్లి నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతరాష్ట్ర రహదారి మరమ్మతుల సమస్యపై సిపిఎం అన్ని వేళలా పోరాటం చేస్తున్న సందర్భం ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను ఓడించి ప్రజల తరపున నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వెంకటేశు, చక్రపాణి, రాజు, మధు, కైలాస్, రైతు సంఘం నాయకులు తాతబాబు, వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎమ్‌పి అభ్యర్థి గీతకు నిరసన సెగలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఆర్థిక నేరస్థురాలు, నకిలీ గిరిజన వ్యక్తి కొత్తపల్లి గీతకు అరకు ఎంపి టిక్కెట్ ఎలా కేటాయించారని, ఐదేళ్ల పాలనలో ఆమె చేసిన అభివృద్ధి శూన్యమని బిజెపి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు మండిపడ్డారు. మండలంలోని వనిజలో గల తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా పురందరేశ్వరి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి బిజెపిలో అంతర్గత కలహాలు మొదలయ్యాయని మండిపడ్డారు. పురందరేశ్వరి తన మరిది చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేయాలన్న తపనతో రాష్ట్రంలో బిజెపిని నిలువునా ముంచేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఎంపి అభ్యర్థిగా కొత్తపల్లి గీతను మార్చుకుంటే బిజెపికి ఓటమి తప్పదని హెచ్చరించారు. బిజెపిలో కొత్తపల్లి గీత కొనసాగితే గిరిజన ఐక్య నినాదంతో ఆమెను వ్యతిరేకిస్తామని తెలిపారు. అధిష్టానం పునరాలోచన చేసి ఎంపి టిక్కెట్ కోసం ఐదు మంది సభ్యులు అభ్యర్థనలో ఎవరికి టికెట్ ఇచ్చినా తామంతా కలిసి పని చేస్తామని, లేకుంటే అరకు ఎంపీ స్థానానికి ముప్పేట దాడి తప్పదని హెచ్చరించారు. అనంతరం ప్లె క్షార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గండి మురళి, ఆగూరు వైకుంఠ రావు, బిడ్డిక రమణ, గిరిధర్ రావు, ధూళికశ్వర రావు, బాలంకి, బివి నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

ఎమ్మెల్యేలను కలిసిన అరకు ఎమ్‌పి అభ్యర్థి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్ రాజును అరకు పార్లమెంట్ వైసిపి అభ్యర్థి డాక్టర్ చెట్టి తనుజారాణి ఆదివారం చినమేరంగిలో మర్యాద పూర్వకంగా కలిశారు. వరుసగా అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న వైసిపిఎమ్మెల్యేలను, ముఖ్య నాయకులను ఆమె కలిస్తున్నారు. దీనిలో భాగంగా కురుపాం ఎమ్మెల్యే దంపతులను కలిసి ఎంపి అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి, పరీక్షితరాజులు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు మనకు ఎల్లప్పుడూ ఉంటాయని, విజయం మనదేనని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : వైసిపి అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజా రాణి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంపి అభ్యర్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ నియోజకవర్గం నుంచి అత్యధిక స్థాయిలో మెజారిటీ లభించడం ఖాయమని, ఎంపీ గా గెలుపొందటం కూడా తథ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను అభ్యర్థికి పరిచయం చేయడం జరిగింది.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ కూడలి సమీపంలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి, దొనక వీధిలో ఉన్న ఇమ్మానియేలు లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ పి.జీవన్ కుమార్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఈస్టర్ పండగ ప్రాముఖ్యత, ఏసుక్రీస్తు మృతి చెందిన తర్వాత మూడో లేవడం, ఇందుకు సంబంధించి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.జాన్, డి.రాజరత్నం, కోట సుందర సుదర్శన్, డి.ప్రదీప్ కుమార్, జయకుమార్, మజ్జిబాబు డి.సుకన్య, రత్నమ్మ, కోట ఈశ్వరరావు, జి.సుధాకర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట విచారణలోని గొయిది ఫాతిమామాత పుణ్యక్షేత్రం, సోమగండి ఆర్‌సిఎం చర్చిల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు పునరుత్థాన ఘట్టం నాటక రూపంలో ప్రదర్శించారు. ఈస్టర్ వేడుకల సందర్భంగా విచారణ ఫాదర్ విద్యాసాగర్ తన ప్రసంగంలో ఏసుక్రీస్తు పునరుత్థానం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆర్‌సిఎం చర్చిలతో పాటు తలవరం, నీలానగరం, తెట్టంగి, తూడి, బిటివాడ, నడుకూరు, నర్సిపురం, కంబర, గడగమ్మ తదితర గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి అభిషేక్ ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు.



వీరఘట్టం : చర్చిలో ప్రార్ధనలు చేస్తున్న క్రైస్తవులు



కురుపాం : చర్చిలో ప్రార్ధనలు చేస్తున్న క్రైస్తవులు

'నవోదయ'కు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బగ్గందొరవలసకు లబ్బ షర్మిల, గోవిందరావు ఈ విద్యా సంవత్సరంలో నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్టు కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు తమ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపిక పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బలిజిపేట : మండలంలోని వెంగాపురానికి చెందిన శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి భోగి వినయ్‌బాబు నవోదయలో ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్, కరస్పాండెంట్ రామ్మోహన్రావు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ బాబుకు పాఠశాల సిబ్బంది స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు



వీరఘట్టం : దీక్షిత్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్

ఇద్దరు విద్యార్థులు ఎంపిక

వీరఘట్టం: మండలంలోని సెయింట్ జేవియర్ పాఠశాలకు చెందిన గేదెల దీపక్, శ్రీగాయత్రి పాఠశాలకు చెందిన వడ్డీ జీవన్ దీక్షత్ ఆదివారం వెలువడిన జవహర్ నవోదయ ఫలితాల్లో ఎంపిక అయినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. జీవన్ దీక్షత్ శ్రీగాయత్రి పాఠశాలలో మొట్టమొదటిసారిగా ప్రారంభించిన నవోదయ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో నవోదయలో ఫలితం సాధించడంతో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ లోకేష్ విద్యార్థులను అభినందించారు.